## క్లుప్తంగా

### జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



రేగోడ్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

రేగోడ్(మెదక్): జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ కోరారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ దత్తరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు యాదగిరి, రాజేందర్ పాటిల్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, ఏఓ జావిద్, ఆర్ఐ ఫెరోజ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్ పాల్గొన్నారు.

### పొదల్లో నల్లా.. నీళ్లు పట్టుకునేదెలా?



అల్లాదుర్గంలో పొదల్లో నల్లాలు

అల్లాదుర్గం(మెదక్): ఇంటింటికీ నల్లా నీళ్లు అందిస్తున్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పథకం కింద పైపులైన్లు వేసి నల్లాలు ఏర్పాటు చేశారు. పైపులైన్ లీకేజీతో నీళ్లు వృథాగా పారి పొదలు వెలిశాయి. అల్లాదుర్గం మండలంలోని మంగలి వాడలో నల్లా చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. పైపులైన్ లీకేజీ అవుతున్నదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నల్లాలు పొదల్లో ఉండటంలో నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### చెరువు మట్టి విక్రయించొద్దు

**తహసీల్దార్, ఐబి అధికారులకు కొట్టాల గ్రామస్తుల ఫిర్యాదు**

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువు మట్టిని విక్రయించొద్దని మండలంలోని కొట్టాల గ్రామస్తులు తహసీల్దార్, ఐబీ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వెంకటేశం, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్, యాదగిరి, తదితరులు మాట్లాడుతూ.. కొట్టాల గ్రామంలోని చౌదరి చెరువులోని నల్ల మట్టిని కొందరు గ్రామ నాయకులు అక్రమంగా అమ్మకానికి సిద్ధం అయ్యారని తెలిపారు. దీని కోసం రెండు రోజుల కిందట చెరువులో పలుచోట్ల జేసీబీతో గుంతలు చేసి మట్టిని పరిశీలించారన్నారు. అధికారులు స్పందించి చెరువు మట్టిని అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### రూ.2లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



శాంతవ్వకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అంజయ్య భార్య శాంతవ్వకు సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, బాషానాయక్ ఉన్నారు.

### చెరువు మట్టి అమ్మవద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువు మట్టిని అమ్మవద్దని మండలంలోని కొట్టాల గ్రామస్తులు తహసీల్దార్ ఆంజనేయులు, ఐబీ డిప్యూటీఈఈ జగన్నాథంకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన వెంకటేశం, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్, యాదగిరి, తదిరులు మాట్లాడుతూ కొట్టాల గ్రామంలోని చౌదరి చెరువులోని నల్లమట్టిని కొందరు గ్రామ నాయకులు అక్రమంగా అమ్మకానికి సిద్ధం అయ్యారని తెలిపారు. అధికారులు స్పందించి చెరువు మట్టిని అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# హై లెవల్ బ్రిడ్జి ఏదీ?

- గతేడాది పోతంశెట్టిపల్లి శివారులో శంకుస్థాపన
- ముందుకు సాగని నిర్మాణ పనులు
- వానాకాలం రాకపోకలకు తప్పని ఇబ్బందులు



వానాకాలం వరద ప్రవాహంలోనే రాకపోకలు (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): హైలెవల్ బ్రిడ్జికి అడుగు పడడం లేదు. గతేడాది పోతంశెట్టిపల్లి శివారులో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాది దగ్గర పడుతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో ఈ వానాకాలం రాకపోకలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

**అర కిలోమీటర్ అవస్థ..**

మెదక్– నర్సాపూర్ జాతీయ రహదారిని అనుకొని ఉన్న పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రహదారి అర కిలోమీటర్ వరకు వానాకాలం వచ్చిందంటే లో లెవెల్ బ్రిడ్జి పై నుంచి వరద ప్రవహిస్తుంది. దీంతో గ్రామస్తులతో పాటు ఈ రహదారి గుండా వెళ్లే వెంకటాపూర్, అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, కొంగోడ్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. బ్రిడ్జి పై నుంచి పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడం, ఒక్కోసారి రెండు రోజులు సైతం నీటి ప్రవాహం తగ్గకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతూ వస్తున్నాయి. దీంతో ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రమాదం జరగకుండా పోలీసుల ఆధ్వర్యంలో ఇక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**ముందుకు సాగని పనులు**

ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని లో లేవల్ బ్రిడ్జిని, హై లెవెల్ బ్రిడ్జిగా నిర్మాణం చేపట్టేందుకు గతేడాది జూన్‌లో ఎఫ్‌డీఆర్ నిధుల కింద రూ. 2.50 కోట్లు మంజూరు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. ఇప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. గత ఏడాది నవంబర్‌లో పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రహదారికి ఇరువైపులా ఉన్న అడ్డంకులను తొలగించి అర్ధాంతరంగా పనులు ఆపివేశారు. దీంతో పోతంశెట్టిపల్లి గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు బ్రిడ్జి నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించి, ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## 5 నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**వ్యవసాయశాఖ ఏడీఏ రాజ్‌నారాయణ**



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

రామాయంపేట(మెదక్): వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక రైతు వేదికలో శుక్రవారం డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల ఐదు నుంచి ఆరు వారాల పాటు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఆన్‌లైన్‌లో కొనసాగుతుందని ఇన్‌చార్జి ఏడీఏ రాజ్ నారాయణ చెప్పారు. ప్రతి రైతుకు ప్రత్యేకమైన గుర్తింపు నంబరు కేటాయించి రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని నిజాంపేట, నార్సింగి, చేగుంట మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మాసాయిపేట మండలంలోని అచ్చంపేట, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం బీటీ రోడ్డు పనులకు రూ. 2.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



గవ్వలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పేట తహసీల్దార్ మన్నన్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతోపాటు గవ్వలపల్లి, రుద్రారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కాంటా చేయడంతోపాటు వెంట వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కోరారు. ఏదైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

### ఘనంగా శంకర జయంతి



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల కేంద్రంలోని పాండురంగ విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం శంకర జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్ఫటిక లింగమునకు ఏకాదశ రుద్రాభిషేకం, శంకరులకు షోడశోపచార పూజ, హారతులు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శంకరుల పటంతో పురవీధులలో విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో హరిరంజన్‌శర్మ, సాత్విక్‌శర్మ, చక్రధర్ శర్మ, నాగరాజు శర్మ, కాశోజీతో భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం



సీపీఆర్ గురించి అవగాహన కల్పిస్తున్న జీవీకే సంస్థ ప్రతినిధి

నిజాంపేట(మెదక్): నస్కల్ గ్రామంలో శుక్రవారం ఉమ్మడి మండలాల ఆర్ఎంపీ, పీఎంపీతో పాటు జీవీకే సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ఎలా చేయాలో జీవీకే సంస్థ ప్రతినిధులు ఆర్ఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బైరవరెడ్డి, భిక్షపతి గౌడ్, రాజేందర్ రెడ్డి, రాజశేఖర్, యాదగిరి, శేఖర్, సాయి, బాలరాజ్, నరేష్, జీవీకే సంస్థహెడ్ సతీష్ రెడ్డి, సతీష్ కుమార్, డాక్టర్లు నికిత, కిషోర్ రెడ్డి, కార్యదర్శి మమత, గ్రామస్తులు ఎల్లం యాదవ్, దుర్గయ్య, లక్ష్మా గౌడ్, రవి పాల్గొన్నారు.

### అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

కౌడిపల్లి(నర్సాపూర్): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి, కూకుట్లపల్లి, భుజిరంపేట గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పూరిగుడిశెలు, అద్దె ఇళ్లలో ఉండే పేదలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనర్హులకు ఎట్టి పరిస్థితిలో మంజూరు కావని చెప్పారు. ఎంపీడీఓ వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

### ఉచిత బైక్ మెకానిక్ శిక్షణ

శివ్వంపేట(నర్సాపూర్): ఉచిత బైక్ మెకానిక్ శిక్షణ శిబిరాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి నెల రోజుల పాటు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో ఉచితంగా బైక్ మెకానిక్ నేర్పించనున్నారు. 18 సంవత్సరాలు నిండి 45 ఏళ్ల లోపు వారందరూ ఉచిత శిక్షణకు అర్హులు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫాంతో పాటు ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 8 వరకు రేషన్, ఆధార్‌కార్డు, పదవ తరగతి మెమో జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94901 03390, 94901 29839 నంబర్లలో సంప్రదించాలి.

### ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం

నర్సాపూర్: రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని అలియెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ (ఆధార్) రాష్ట్ర అధ్యక్షుడు శేష గిరిరావుగౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అగ్ర వర్ణాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రాధాన్యత లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుద్దయ్య, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ గౌడ్, కోశాధికారి నదకిశోర్, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నవీన్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబందించిన సర్వే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ గ్రామంలో 40 మంది లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉందని తెలిపారు. సంబంధిత లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం స్థలం ఉన్నదా లేదా తెలుసుకునేందుకు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ సర్వేలో వ్యవసాయ అధికారి హరిప్రసాద్, పంచాయతీ సిబ్బంది లింగం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ వైభవంగా వెంకటేశ్వర ఉత్సవాలు**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో గోదాసమేత లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త, కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ లబ్ధిదారుల పరిశీలన**

శివ్వంపేట(నర్సాపూర్) : మండలానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అసలైన లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం గ్రామాల్లో పర్యటించారు. మండలానికి 382 ఇళ్లు మంజూరు కాగా ఇందిరమ్మ కమిటీ ద్వారా వచ్చిన వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఎంపీఓ తిరుపతి రెడ్డి తెలిపారు. మొదటి ప్రాధాన్యత కింద ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి మంజూరు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

**◆ ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర**

నర్సాపూర్ రూరల్: మండలంలోని రామచంద్రపూర్‌లో వెలిసిన పెద్దమ్మ తల్లి జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారి అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి ఒడి బియ్యం, కానుకలు సమర్పించారు. మధ్యాహ్నం పెద్దమ్మ తల్లి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సాయంత్రం భక్తి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**◆ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి**



నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ ముస్తఫా(32) శుక్రవారం అనారోగ్యం మృతి చెందాడు. నిజాంపేట గ్రామానికి చెందిన ముస్తఫా టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పార్టీలో చురుగ్గా పాల్గొంటూ అనేక కార్యక్రమాల్లో తనదైన సేవలు అందించారు. గత కొంత కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ శిబిరంలో విద్యార్థులతో తహసీల్దార్ మన్నన్, ఎంఈఓ పుష్పవేణి



చేగుంట(తూప్రాన్): పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ నీరజ

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ అన్నారు. శుక్రవారం పేట జెడ్పీ పాఠశాలలో వేసవి శిక్షణ కేంద్రాన్ని ఎంఈఓ పుష్పవేణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుష్పవేణి మాట్లాడుతూ.. మండలంలోని 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15 రోజులపాటు ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లిష్ మొదలుగు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూరారం, ధరిపల్లి జెడ్పీపాఠశాల హెచ్‌ఎంలు సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాధ్యాయులు పోచయ్య, ఫణీంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

**నార్సింగిలో...**

నార్సింగి జెడ్పీపాఠశాలలో ఇన్‌చార్జి ఎంఈఓ గంగాబాయి వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 1 నుంచి 15 వరకు శిక్షణ ఉంటుందని, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అందించే కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వర్మ, స్వామి, శశికళ, సాయి, నవీన, బాలాగౌడ్ సుస్మిత పాల్గొన్నారు.

**యోగా, క్రీడలు, డ్రాయింగ్‌పై...**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో 3 నుంచి 17 వరకు మనోవికాసం కార్యక్రమంపై పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలరాజు తెలిపారు. శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో సమ్మర్ క్యాంప్ ట్రైనర్స్‌తో సమావేశం నిర్వహించారు. యోగా, క్రీడలు, డ్రాయింగ్, కంప్యూటర్ ఆపరేటింగ్‌పై 15 రోజులు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిక్షణ ఉంటుందని, 14 ఏళ్ల లోపు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ సత్యం, యాదగిరి, కరుణాకర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

**చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సమ్మర్ క్యాంతప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కంప్యూటర్, యోగా, కుట్లు అల్లికలు, ఆటలపై శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరణం శ్రీదేవి, గిరిదయాల్, గీత, రేణుక తదితరులు ఉన్నారు.

**శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

నర్సాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ తారాసింగ్ సూచించారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరం ప్రారంభించి మాట్లాడారు. శిబిరం 15రోజుల పాటు కొనసాగుతుందన్నారు. శిబిరంలో యోగా, కరాటే, డ్రాయింగ్, పెయింటింగ్, నృత్యం తదితర అంశాలు నేర్పిస్తారని తెలిపారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్నులు అందజేస్తామని చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఈఓతో పాటు పాఠశాల హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు సామ్యానాయక్, భీమ్లానాయక్, పెంటయ్య, రవి రాజ్, సీఆర్‌పీలు భైరవరెడ్డి, నరసింహచారి, సుజాత పాల్గొన్నారు.

## దేవుడి ఆభరణాలు అప్పగింత



వీరభద్రుడి ఆభరణాలను అందజేస్తున్న ఆలయ కమిటీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలోని ప్రాచీన వీరభద్ర దేవాలయం ఇటీవల దేవాదాయశాఖలో విలీనం అయింది. దీంతో ఆలయానికి సంబంధించిన దేవుడి వెండి, బంగారు ఆభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ శుక్రవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావుకు అప్పగించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. వీరభద్రుడికి చెందిన మూడున్నర కేజీల వెండి ఆభరణాలు, తులం రెండు గ్రాముల బంగారు ఆభరణాలు కమిటీ అప్పగించిందని తెలిపారు. వీటి విలువ రూ. 3,51,200 ఉంటుందన్నారు. అనంతరం దేవాలయ హుండీ లెక్కించగా సుమారు రూ. 2 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

### మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు దేశంలో కులగణన చేపట్టలేదని, ఆ ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కిందని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నాయకులు నత్తి మల్లేష్, మండల నాయకులతో కలిసి కాళ్లకల్ ప్రధాన చౌరస్తా వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దేశంలో కులగణన చేస్తే అన్ని సమస్యలు తొలగిపోతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేందర్‌చారి, గ్రామ అధ్యక్షుడు మల్లేష్, గోపాల్, కృష్ణ, కరాటే మల్లేష్, నాగేందర్, ప్రణయ్, హరిబాబుగౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): కులగణన విషయమై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ బీజేపీ కార్యకర్తలు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మట్లాడారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అవినాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, జిల్లా నాయకులు తదతరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్ శివారులో గల మంజీరా నదిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సుమారు 35 నుంచి 45 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం మంజీరా నదిలో తేలియాడుతుండగా స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి పంచనామ నిర్వహించి, పోస్ట్ మార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించాం. మృతుడి ఒంటిపై నలుపు, నీలం రంగు ప్యాంటు మాత్రమే ఉందని, చేపల వేటకు వెళ్లి చనిపోయి ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలు తెలిస్తే 87126 57920 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని అల్వాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. సన్నరకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని చెప్పారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ప కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఏపీఎం దాకయ్య, సీసీ బాలరాజు, ఉపాధి టీఏలు పరశురాములు, యాదవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, వీఓఏలు యమున, దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఆట పాటలతో ఆరోగ్య వికాసం



సమ్మర్ క్యాంపు ప్రారంభించిన ఉపాధ్యాయులు

పాపన్నపేట(మెదక్): ఆట పాటలతో ఆరోగ్యం వికసిస్తుందని పాపన్నపేట ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం భట్టు నాగరాజుతో కలసి సమ్మర్ క్యాంపు ప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15రోజుల పాటు జరిగే ఈ క్యాంపులో వివిధ రకాలు ఆటలతో పాటు ఆత్మరక్షణ విద్యలు నేర్పుతారని తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు స్నాక్స్, తాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీచర్లు అనిల్, యాదయ్య, రమేష్, సీఆర్పీలు నవాజ్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మహేశ్వరి, రాజశేఖర్, సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు.